## క్లుప్తంగా

### లక్ష్మీదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**రాయచోటి జగదాంబ సెంటర్ :** స్త్రీ, మాతృశక్తికి ప్రతిరూపంగా, సనాతన విలువలకు పునాదిగా భక్తిశ్రద్ధలతో ఆచరించే వరలక్ష్మీ వ్రతం తెలుగు సంస్కృతిలో ఎంతో విశిష్ట స్థానం ఉందని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పవిత్ర వరలక్ష్మీ వ్రతం ప్రతి కుటుంబంలో శాంతి, ఐశ్వర్యం, ఆరోగ్యాలను ప్రసాదించాలని, అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ఆయన ఆకాంక్షించారు. శ్రావణమాసంలో జరుపుకునే వరలక్ష్మీ వ్రతం ఎన్నో శుభాలు, సిరిసంపదలు, సంతోషాలు అందించాలని ఆయన అభిలాషించారు. ఈ సందర్భంగా ఆడబిడ్డలు, మహిళలకు ఆయన వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపారు.

### మేధో సంపత్తి హక్కులపై అవగాహన సదస్సు

**రాయచోటి టౌన్ :** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఆర్ఏఎంపీ కార్యక్రమంలో భాగంగా పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మేధో సంపత్తి హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం కళాశాల ఆవరణలో ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలి, వాటి ప్రాముఖ్యత, ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎలా పరిష్కరించుకోవాలనే అంశాలపై వివరించారు. అలానే ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్, జిల్లా పరిశ్రమల అధికారి కె. కృష్ణకిశోర్, అధికారులు కె. నాగార్జున, డి.శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణం తనిఖీ

**చిట్వేలి :** చిట్వేలిలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయ అధికారి సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను ఎంఆర్‌పీ ధరకు మించి అమ్మినా, అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీ లక్ష్మీ శ్రీనివాస దుకాణంలో డీఏపీ నిల్వను రిజిస్టర్‌లో 12 బస్తాలను అప్‌డేట్ చేయనందుకు మందలించారు.

### ఎమ్మార్పీ ధరకే విక్రయించాలి

**రైల్వేకోడూరు అర్బన్ :** రైతులకు ఎరువులు ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకొంటామని రాజంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు శివశంకర్ తెలిపారు. గురువారం ఆయన అధికారులతో కలిసి పట్టణంలోని ఎరువు, పురుగు మందులు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్వాహకులు రిజిస్టర్లు, బిల్లులు చెల్లింపులు పక్కాగా ఉండాలన్నారు. స్టాక్ బోర్డు ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పవన్, నాగలక్ష్మి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా పరికరాలు అందజేత

**పెనగలూరు :** మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా పరికరాల కొనుగోలుకు ఎన్ఆర్ఐలు కొమ్మిరెడ్డి ప్రీతిరెడ్డి, నరసింహారెడ్డి దంపతులు పదివేల రూపాయలను అందజేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. దాతలు అందజేసిన మొత్తంతో క్రీడా పరికరాలు కొని గురువారం విద్యార్థులకు అందజేశారు.

### బొప్పాయి పంటను తక్కువకు కొంటే చర్యలు

**రైల్వేకోడూరు అర్బన్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బొప్పాయి రైతుల వద్ద నుంచి కిలో రూ.9కి కంటే తక్కువకు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని గురువారం రాజంపేట సబ్‌కలెక్టర్ భావన పేర్కొన్నారు. స్థానిక సభా భవనంలో జిల్లా ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేతో కలిసి, వ్యాపారులు, దళారులతో సమావేశమై చర్చించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసినట్టు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

### రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి

**ఓబులవారిపల్లె :** వై.కోట గ్రంథాలయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా విద్యార్థులు గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రవీంద్రనాథ్ ఠాగూర్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

### సాలు నాటు పద్ధతితో దోమపోటు నివారణ

**సుండుపల్లె :** వరిలో సాలు నాటు పద్ధతి ద్వారా దోమపోటను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు వీరనాగయ్య, ఆంజనేయులునాయుడు తెలిపారు. గురువారం మండల పరిధిలోని సిద్దారెడ్డిగారిపల్లికి చెందిన కౌలు రైతు జి.లక్ష్మయ్య రెండు ఎకరాల పొలంలో బీపీటీ రకం వరినారు నాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాలు నాటు విధానం వలన లాభాలను వివరించారు. ప్రతి ఒక్క రైతు ఈ విధానాన్ని పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీడ్ ఫార్మర్ షబానా, గ్రామంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గుత్తేదారు నిర్వాకం.. అధికారుల నిర్లక్ష్యం!

- చిన్నఓరంపాడు క్రాస్ నుంచి రోడ్డులేక ప్రజల ఆపసోపాలు
- త్వరగా రోడ్డు నిర్మించాలంటూ స్థానికుల వేడుకోలు



మండల కేంద్రానికి వెళ్లే రహదారిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

**ఓబులవారిపల్లె :** మండల కేంద్రంపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందనే వాదన ఓబులవారిపల్లె ప్రజలు తెలియజేస్తున్నారు. చిన్నఓరంపాడు క్రాస్ నుంచి ఓబులవారిపల్లెకు రోడ్డు నిర్మాణం దశాబ్దాలుగా కలగానే ఉంది. వివరాల్లోకి వెళితే ఇటీవల చిన్నఓరంపాడు జాతీయ రహదారి నుంచి గాదెల కొత్తపల్లి వరకు సుమారు రూ.1.70 కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డును నిర్మించారు. కానీ అనేక పర్యాయాలు ఇటు అధికారులకు అటు కూటమి నాయకులకు స్థానికులు సమస్యను తెలియజేసిన నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఉన్న సమస్యను పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దశాబ్దాలుగా చిన్నఓరంపాడు క్రాస్ రోడ్డు నుంచి ఓబులవారిపల్లి రైల్వేస్టేషన్, బస్సు సెంటర్ వరకు డబుల్ రోడ్డు కోసం ప్రజలు ఎదురు చూస్తూ వచ్చారు. రైల్వే అండర్ బ్రిడ్జి వరకు డబుల్ రోడ్డు వేసి రోడ్డుకు ఆవలివైపు కొత్తపల్లి వరకు కొనసాగించారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం మీదుగా రైల్వేస్టేషన్ వరకు నేరుగా డబుల్ రోడ్డు వేయలేదు. తహసీల్దార్ కార్యాలయానికి, బ్యాంకులు, ఎంఈఓ కార్యాలయం, పాఠశాల, అమ్మవారిశాల, లైబ్రరీ, వ్యవసాయ కార్యాలయం, సచివాలయాలు ఉన్నాయి. ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల బాట పట్టాలని అలాంటి మార్గాలలో డబుల్ రోడ్డు ఎందుకు వేయకపోవడంతో ప్రజలు ఆశ్చర్యపడాల్సిన పరిస్థితి నెలకొంది. రూ.1.70 కోట్లతో మండల కేంద్రం వరకు రోడ్డు వేయాల్సి ఉన్నా గుత్తేదారులు ఎందుకు వేయలేదని అధికారులు చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వరకు డబుల్ రోడ్డు వెంటనే ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

**ప్రజలకు తీవ్ర అవస్థలు**



మండల కేంద్రంలో డబుల్ రోడ్డు వేయకపోవడంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ప్రస్తుతం నిర్మించిన రోడ్డు గాదెల వరకు నిర్మించిన కాంట్రాక్టర్ మండల కేంద్రానికి రోడ్డు వేయకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై మండల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్థానికులు సౌకర్యార్థం రోడ్డు నిర్మించాలని కోరారు.

– ఓజీ శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు

## చిరిగిపోయే బ్యాగులు ఇచ్చిన ఘనత చంద్రబాబుదే

- కూటమి పాలనలో భ్రష్టుపట్టిన విద్యారంగం
- జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారంలో మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన నాణ్యత లేని బ్యాగును చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

**ఒంటిమిట్ట :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేని కూటమి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సాలాబాదు గ్రామంలో ఆయన జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఇచ్చిన రెండు నెలలకే ప్రభుత్వం విద్యార్థి మిత్ర ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన బ్యాగు చిరిగిపోయిందని విద్యార్థులే ఆయనకు చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ చేసిన హామీలు అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదని ప్రచారానికి పోయిన ప్రతి ఇంటిలో మాకంటే ముందే ప్రజలు చెబుతున్నారన్నారు. అదే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే తాను ఎన్నికల సమయంలో చెప్పిన హామీలన్ని నెరవేర్చారన్నారు. అన్నిటికి మించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అమ్మ ఒడి, నాణ్యమైన జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక కిట్లు, నాడు – నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా రూపురేఖలను మార్చడం వంటి ఎన్నో మంచి పనులు చేశారన్నారు. ఐతే నేటి కూటమి ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యార్థి మిత్ర అంటూ అదే పథకాన్ని తిరిగి తీసుకొచ్చిందని అయితే జూన్ నెలలో కూటమి ఇచ్చిన బ్యాగులు నాణ్యత లేక రెండు నెలలకే చిరిగిపోతున్నాయన్నారు. ఇంతటి దుర్మార్గ పాలన అందిస్తున్న చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచారంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, దేవసాని ఆదిత్యరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జైచంద్రారెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునిల్ కుమార్, జిల్లా యువజన భాగం అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, మైనారిటీ నాయకులు షఫి, ఇలియాస్, మాజీ కార్పొరేటర్లు శ్రీరామరెడ్డి, జైచంద్రారెడ్డి, సాలాబాదు సర్పంచ్ స్వర్ణలత, కొత్తమాధవరం సర్పంచ్ పన్నెల చంద్ర, ఉప సర్పంచ్ మురళి, పెన్నపేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, లంకా రామిరెడ్డి, గంగిరెడ్డి, శేషారెడ్డి, అనంతరామయ్య, పోతిరెడ్డి రాము పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ రమేష్‌పై దాడి



కూటమి నాయకులకు బుద్ధిని ప్రసాదించాలని పూలే విగ్రహం వద్ద విన్నవిస్తున్న నాయకులు

**రాయచోటి జగదాంబసెంటర్ :** జెడ్పీటీసీ ఉప ఎన్నికలలో ఓటమి భయంతోనే కూటమి నాయకులు వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి పాల్పడినట్లు వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి కూటమి నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రావడానికి బీసీల చట్టం తెస్తానని చెప్పి బీసీలపై దాడులు చేసే వారి కోసం అండగా నిలిచేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి ప్రశ్నించే వారిపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకొని బడుగు, బలహీన వర్గాల పైన దాడులు చేయడం మానేసి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో రామాపురం జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు అర్ల సుబ్బయ్య, రేపన సంజీవయ్య, అంబాబత్తిన రమేష్, అన్నమయ్య జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సాంబశివ, సర్పంచ్ ఈశ్వర్, రాయచోటి పట్టణ అధ్యక్షులు నవాజ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజయాదవ్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు నరేష్, మాజీ ఎంపీటీసీ శివయ్య, శాలివాహన అధ్యక్షులు నాగేంద్ర, రజక సంఘం అధ్యక్షులు జగదీష్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు సురేష్‌కుమార్ రెడ్డి, అశోక్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఇంతియాజ్, మహబూబ్‌బాషా, సుబ్బరాయుడు, గొర్లముదివీడు శివ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ‘తప్పు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం’



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాలంరెడ్డి దశరథరామిరెడ్డి

**రాయచోటి టౌన్ :** మాపై దౌర్జన్యాలు చేసిన వారిని వదిలిపెట్టి నాపై కేసులు పెట్టడం అక్రమమని రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ పాలంరెడ్డి దశరథరామిరెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2002వ సంవత్సరంలో సర్వే నంబర్ 553లో రెండు సెంట్ల భూమిని ఆదిరెడ్డి, ముబారక్‌లకు అమ్మేందుకు ధర నిర్ణయించుకొని అగ్రిమెంట్ చేయించామన్నారు. అనంతరం వారు కేవలం 1.5 సెంట్లకు మాత్రమే డబ్బులు చెల్లించడంతో వారికి ఉత్తరం వైపున 1.5 సెంట్ల భూమిని స్వాధీనం చేయడం జరిగిందన్నారు. మిగతా స్థలాన్ని తమ ఆధీనంలోనే ఉంచుకున్నామన్నారు. స్థలం కొనుగోలు చేశాక తన వద్ద ఉన్న పత్రాలు పొందాక స్థలం మొత్తం తమదేనని వారు చెప్పుకుంటుండటాన్ని తప్పుబట్టారు. ఈ విషయమై తాము నామమాత్రపు దస్తావేజు సహాయంతో 2021లో రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వ్యాజ్యం దాఖలు చేయడం జరిగిందన్నారు. ఈ వ్యాజ్యం పెండింగ్‌లో ఉండగానే రాయచోటి తహసీల్దార్, అప్పటి పోలీసులు భూమిని కొలిచేందుకు నాకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. అప్పుడు 2022లో హైకోర్టులో అప్పటి అధికారులు మండెం ఆదినారాయణ రెడ్డిలపై రిట్ పిటీషన్ దాఖలు చేసి సదురు స్థలంలో తనకు ఎటువంటి అంతరాయం కలిగించరాదని ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఇటీవల ఆదినారాయణరెడ్డి తన అనుచరులతో కలసి నా ఆధీనంలో ఉన్న స్థలంలో రాళ్లు నాటించేందుకు ప్రయత్నించగా కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌ను చూపిస్తున్నా పట్టించుకోకుండా తనను బండ బూతులు తిట్టడమే కాకుండా దాడికి యత్నించారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళితే తీసుకోకుండా తనపైనా హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. తన తప్పు ఉన్నట్లు నిరూపిస్తే నేను ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నానని పాలంరెడ్డి పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చొరవచూపాలి

**సంబేపల్లె :** ప్రభుత్వానికి సమస్యలు తెలియజేయడంలో భాగంగా ‘టీ తాగుదాం – చర్చించుకుందాం ’కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల అధికారులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అలానే పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చర్చా వేదికలో తహసీల్దార్ సబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీ రామచంద్ర, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ హాజరయ్యారు.అనంతరం ఉద్యోగుల సమస్యలపై చర్చించారు.

### ప్రోత్సాహంతోనే శాస్త్రవేత్తలుగా విద్యార్థులు

**రాజంపేట రూరల్ :** నేటి విద్యార్థులను సైన్స్ ఉపాధ్యాయులు అన్ని విధాల ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని సైన్స్ కో-ఆర్డినేటర్ రవిశంకరరెడ్డి అభిప్రాయపడ్డారు. స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన డివిజనల్ స్థాయి ఇన్‌స్పైర్ మానాక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిశంకరరెడ్డి మాట్లాడుతూ బాలలలోని అన్వేషణాత్మక ఆలోచనలను పెంపొందటానికి ప్రతి విద్యార్థిని సైన్స్ సంబంధిత పోటీలలో పాల్గొనేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.జయలక్ష్మి, రిసోర్స్ సభ్యులు వెంకటసుబ్బయ్య, గంగాధర్‌తో పాటు సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం బోగా వెంకటసుబ్బయ్య, శివప్రసాద్‌లను ఉపాధ్యాయులు సన్మానించారు.

### మహిళా స్కూటరిస్టులకు లైసెన్స్‌లు తప్పనిసరి

**రాజంపేట :** మహిళా స్కూటరిస్టుకు లైసెన్స్‌లు తప్పనిసరి, కాబట్టి లైసెన్స్ కలిగివుండటం మీ బాధ్యత అనేది గుర్తుంచుకోవాలని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ లైసెన్స్‌లు విషయంలో మహిళలకు మినహాయింపు లేదనేది గుర్తుంచుకోవాలన్నారు. లైసెన్స్ విషయంలో మహిళ, పురుషుడు అనే తేడా లేదన్నారు. ఏదైనా ప్రమాద సంఘటనలు తలెత్తినప్పుడు ప్రధానంగా లైసెన్స్ అంశం తెరపైకి వస్తుందనేది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అలానే మహిళా వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రాజంపేట ప్రాంతాల్లో మహిళలు కొందరు లైసెన్స్‌లు లేకుండా యథేచ్ఛగా స్కూటీలు నడుపుతున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. తనిఖీలలో పట్టుబడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో లైసెన్స్ తీసుకోవడం వల్ల ఉపయోగాలు, లేకుంటే నష్టాల గురించి అవగాహన కల్పించేందుకు సదస్సులు చేపట్టాలనే యోచనలో ఉన్నామని ఎంవీఐ తెలిపారు.

### పరేడ్‌కు విద్యార్థులు ఎంపిక

**గాలివీడు :** జిల్లా స్థాయి స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా జరిగే పరేడ్‌లో నూలివీడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల స్కౌట్ మాస్టర్ కరకోటి చంద్రశేఖర్ గురువారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం రాయచోటిలో కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు 9 మంది రైడ్స్, గైడ్స్, 7 మంది స్కౌట్స్ ఎంపికయ్యారని చెప్పారు. గతంలోనూ ఇదే పాఠశాల విద్యార్థులు పలుమార్లు రాష్ట్ర, జిల్లా స్థాయి స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పలువురు స్కౌట్స్, గైడ్స్ పేరెడ్ నిర్వహించి ప్రశంసలు అందుకున్నారని తెలియజేశారు.

### మొక్కలు నాటి సంరక్షించాలి

**రాయచోటి జగదాంబసెంటర్ :** మానవాళి భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని ఆ కళాశాలలో చెట్లు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్న నినాదాన్ని వినిపిస్తూ, చెట్లు నాటడం వల్ల పొందే ఉపయోగాలను వివరించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డా.వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రెడ్డయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా పని గంటల అమలు

**రాజంపేట :** రవాణా రంగంలో కార్మికులకు పనిగంటలను పకడ్బందీగా అమలు చేయాలని రాజంపేట కార్మికశాఖ సహాయ కమిషనరు శ్రీనివాస్ తెలిపారు. కార్మికశాఖ కార్యాలయంలో రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులు, యజమానులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యజమానులు సెక్షన్ 13 నుంచి సెక్షన్ 20 వరకు పొందుపరిచిన అంశాలపై అవగాహన కలిగివుండాలన్నారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించాలన్నారు. కౌమరదశలో ఉన్నటువంటి వారికి ఆరుగంటలు మాత్రమే డ్యూటీలు వేయాలన్నారు. ఐదు గంటల డ్రైవింగ్ తర్వాత అరగంట విశ్రాంతి ఇవ్వాలన్నారు. వారానికి ఒకరోజు సెలవు ఇవ్వాలన్నారు. ఈ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## పాఠశాలల్లో టీచర్ల కొరత బాధాకరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

**ఓబులవారిపల్లె :** వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజలను తిప్పుకోకుండా వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు.గురువారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ దీపాలు, రోడ్ల తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలియజేశారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 60 మంది ఉపాధ్యాయుల కొరత ఉండడం బాధాకరమన్నారు. రెవెన్యూ సమస్యలపై కార్యాలయానికి వచ్చే రైతులను తిప్పుకోవద్దన్నారు. ఉపాధి పథకంలో అవకతవకలు లేకుండా చూడాలన్నారు. ఇరిగేషన్ అధికారులు తమ శాఖకు సంబంధించిన సమస్యలను పర్యవేక్షించి పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ మల్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యం, వీధిలైట్లు, డ్రైనేజీలు తదితర పనుల్లో పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్య, వైద్య, విద్యుత్ తదితర శాఖల సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, ఎల్.గంగరాజు, ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ గూడూరు గౌరీశంకర్‌రాజు, తహసీల్దార్ సుమణి, పీఆర్ డీఈ బాల నరసింహులు, ట్రాన్స్‌కో ఏఈ కిరణ్ కుమార్, హౌసింగ్ ఏఈ ఓబులేశు, ఎంఈఓ రెడ్డయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు లాభదాయకం ప్రకృతి వ్యవసాయం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి జయరాణి

**లక్కిరెడ్డిపల్లి :** ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సంచాలకులు ఎం.జయరాణి పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లి డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో లక్కిరెడ్డిపల్లి మండల సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ ఆధారిత ప్రకృతి వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జయరాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యత, ప్రకృతి వ్యవసాయం, మౌలిక విధానాలను సిబ్బందికి వివరించారు. అనంతరం అంతపురం పంచాయతీ చౌటపల్లి గ్రామ రైతులకు ఏపీఎస్ఎల్ఎఫ్ ఆధ్వర్యంలో ఘన జీవామృతం, విత్తన గుళికల తయారీ, నీమాస్త్రం తయారీ, ఏటీఎం పద్ధతులు, పీఎండీఎస్ పద్ధతులు, ఏ గ్రేడ్ మోడల్, వివిధ సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి, వీరబల్లి, రామాపురం, గాలివీడు మండలాల వ్యవసాయ అధికారులు, రైతుసేవా కేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్

**గాలివీడు :** ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా ఏదైనా ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి వస్తే పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలను సభ దృష్టికి తీసుకొచ్చి ప్రజాప్రతినిధులకు వివరించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కార మార్గాలు చూపాలని కోరారు. ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ మాట్లాడుతూ రాజకీయాలను పక్కన పెట్టి గ్రామాల్లో సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో సమావేశానికి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కస్తూర్బా ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

**వీరబల్లి :** మండల పరిధిలోని ప్రభుత్వ కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులు, పాఠశాల నాన్ టీచింగ్, టీచింగ్ స్టాఫ్‌ను బెదిరింపులకు గురిచేస్తూ వేధిస్తున్న ప్రిన్సిపల్ సాయి దివ్యను వెంటనే సస్పెండ్ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ ఎంఈఓ-1 వీరనాగయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే పాఠశాలలో టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు చెందిన వారి వ్యక్తిగత గొడవల వలన ఉద్దేశపూర్వకంగానే ఫుడ్ పాయిజన్ సంఘటన చోటు చేసుకుందని, ఆ సమయంలో విద్యార్థినులు ఆసుపత్రి పాలయ్యారన్నారు. ఇలా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘంగా అనేకమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లడం జరిగిందన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఇదే పాఠశాలలో చదివే విద్యార్థినీకి సంబంధించి ప్రిన్సిపల్ నిర్లక్ష్యంతో హాల్ టికెట్‌లో పేరు తప్పుగా వచ్చిందన్నారు. దీనిపై తమ సంఘం ఆధ్వర్యంలో డీఈఓకు ఫిర్యాదు చేశామన్నారు. ఎటువంటి ఆర్డర్స్ లేకుండా ఇదే పాఠశాలలో కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్న వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో తెలిపాలన్నారు. అక్రమాలకు నెలవుగా మారిన కస్తూర్బా పాఠశాలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరారు.

### దళితుల భూ సమస్యలు పరిష్కరించండి

**రాజంపేట :** డివిజన్ పరిధిలో దళితుల భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సబ్‌కలెక్టర్ భావనకు దళితనేతలు విన్నవించారు. గురువారం సబ్ కలెక్టరును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ భూ సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు గాలిశెట్టి మనోహర్, ప్రధాన కార్యదర్శి పిల్లి చంద్రశేఖర్ విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిటైర్డు ఉద్యోగులు సమాజ సేవ చేసేందుకు ఎస్సీ, ఎస్టీ భూ సంరక్షణ సంఘం ఏర్పాటు చేసుకున్నామన్నారు. సంఘం తరపున దళితులు భూ సమస్యలను సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఎస్సీ, ఎస్టీ కూలీలు ఆర్థికంగా ఎదగాలని పత్రాలు ఇచ్చారే కానీ భూమి ఇప్పటికీ చూపలేదన్నారు. అలానే భూములకు ఆన్‌లైన్ లేని కారణంగా ప్రభుత్వం రైతులకు అందించే పథకాలు అందడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం దళితులకు శాపంగా మారిందన్నారు. అసైన్డ్ భూములు ఓసీ, బీసీలకు బదిలీ చేసి కొందరు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఆక్రమిత భూములు, ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌ను కోరామన్నారు.